క్లుప్తంగా

సీపీఐ శత వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



లక్ష్మీపురం: స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం శత వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ఈనెల 26 నాటికి 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతుందని తెలిపారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ఎన్నో సమరశీల పోరాటాలకు ముందుండి నడిపిన చరిత్ర సీపీఐకే దక్కుతుందని వివరించారు. పార్టీ శత వార్షికోత్సవాలను 2025 సంవత్సరమంతటా వాడవాడలా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, గని, నాయకులు శ్రీనివాసరావు, పి. జగన్నాథం, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు జాతీయ అవార్డులు



అనూష



ఆదినారాయణ

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ఇద్దరు ఉద్యోగులు జాతీయ అవార్డులు అందుకున్నారు. న్యూఢిల్లీలో ఈనెల 21న జరిగిన 69వ వారోత్సవాల కార్యక్రమంలో అతి విశిష్ట రైలు సేవా పురస్కారాలను సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కో ఆర్డినేషన్ జవ్వాది వెంకట అనూష, డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పి.ఆదినారాయణలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చేతుల మీదుగా అందుకున్నట్లు డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. విధుల్లో శ్రద్ధతో పాటు డివిజన్ అభివృద్ధికి కృషి చేసినందుకు గాను గుర్తించి అవార్డులను అందుకున్నారని ఆయన వివరించారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేసే ప్రతి ఒక్కరికీ రైల్వే శాఖ గుర్తింపు తప్పకుండా ఉంటుందని తెలిపారు. అనంతరం అతి విశిష్ట రైల్వే పురస్కారాలు అందుకున్న ఇద్దరిని ఆయన అభినందించారు.

చర్చికి క్రిస్మస్ కేక్ అందించిన భారతి సిమెంట్



నగరంపాలెం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని భారతి సిమెంట్ గుంటూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు వసంతరాయపురం చర్చికి క్రిస్మస్ కేక్‌ను పంపిణీ చేశారు. చర్చి ఫాదర్ రమేష్, వినోద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భారతి సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ పి.సురేష్, సీనియర్ టెక్నికల్ అధికారి ఎస్.భవానీశంకర్, జిల్లా డీలర్ బి.ఎల్.వి.శివారెడ్డి (లక్ష్మీ ఏజెన్సీ) పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డేటా ఎనలిటిక్స్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధి హరిప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీటెక్, బీఈ కోర్సుల్లో ఉత్తీర్ణులై 20 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు నందిగామలోని కీట్స్ క్యాంపస్‌లో 90 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. బీఏతోపాటు, బీటెక్‌లో సివిల్, మెకానికల్ అభ్యర్థులు అర్హులు కాదని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శిక్షణానంతరం సర్టిఫికెట్‌తో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న శిక్షణా కార్యక్రమానికి ఆసక్తి గల అభ్యర్థులు 90004 87423 (హరిప్రసాద్), 98498 88266 (శ్రీనివాస్) నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



వెంకటరెడ్డి

లక్ష్మీపురం: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7/4వ లైన్ ప్రాంతానికి చెందిన దుండి వెంకటరెడ్డి ముఠా పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంటాడు. రోజు అర్ధరాత్రి 12 గంటలకు తిరిగి ఇంటికి చేరుకుంటాడు. అయితే, ఈనెల 21న మధ్యాహ్నం పనికి వెళ్లిన వెంకటరెడ్డి తిరిగి ఇంటికి చేరుకోలేదు. మరుసటి రోజు కూడా రాక పోవడంతో భార్య వెంకటేశ్వరమ్మ చుట్టు పక్కల వారిని, బంధు మిత్రుల వద్ద విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు అరండల్‌పేట పోలీస్ స్టేషన్ 0863-2231955 నంబర్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు.

ప్రభువు జననం.. లోకానికి ఆనందం

- వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు చర్చిల్లో ప్రార్థనలు
- క్రీస్తు నామస్మరణతో మార్మోగిన పల్లెలు



నడింపాలెంలోని కల్వరి తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ సిద్దెల సల్మాన్‌రాజు, మందా సుదర్శన్



విద్యుత్ వెలుగుల్లో వడ్లమూడిలోని క్రీస్తు లూథరన్ చర్చి

ప్రత్తిపాడు: ప్రేమకు, దయకు ప్రతిరూపం.. శాంతికి, మానవతకు నిలువెత్తు నిదర్శనమైన కరుణామయుడు.. లోకరక్షకుడైన యేసుప్రభువు జనిమించిన తరుణాన్ని క్రైస్తవ సోదరులు ఆనందోత్సాహాల నడుమ సంబరాలు జరుపుకున్నారు. క్రిస్మస్ శుభదినాన ప్రత్యేక అలంకరణలు, విద్యుద్దీప కాంతులతో సరికొత్తగా శోభలీనుతున్న చర్చిల్లో ప్రార్థన గంటలు మృదుమధురంగా మోగాయి. రక్షకుడి రాకకు గుర్తుగా మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రార్థనా మందిరాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు జన్మదినమైన బుధవారం రోజున పల్లెలన్నీ క్రీస్తు నామస్మరణతో మార్మోగిపోయాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిల్లో ఉదయం నుంచే చిన్న పిల్లలు, పెద్దలు ప్రభు గీతాలాపనలతో ప్రార్థనలు నిర్వహించారు. యువకులు క్రిస్మస్ శుభాకాంక్షలతో పెద్దపెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం, ఈదులపాలెం, యనమదల, తూర్పుపాలెం, రావిపాటివారిపాలెం, గొట్టిపాడు, చినకోండ్రుపాడు, నడింపాలెం గ్రామాలలోని చర్చిల్లో రెవరెండ్లు, పాస్టర్లు ఆరాధన, వాక్యపరిచర్య, సందేశం వంటి కార్యక్రమాలను జరిపారు. భక్తులకు దీవెనలను అందచేశారు. ప్రభువు జననంతో లోకానికి వెలుగు వచ్చినట్లుగా భావించి తమ కుటుంబంలో కూడా సమస్యలు లేకుండా వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మహిళలు పెద్దఎత్తున కొవ్వత్తులను వెలిగించి క్రీస్తుపై మమకారాన్ని చాటుకున్నారు. ఏసు లోకరక్షకుడని కొనియాడారు. పశువుల పాకలో జన్మించి నిరాడంబర జీవితాన్ని గడిపి, తనకున్న దానిలో అందరికీ పంచి పెట్టిన దైవం ఏసు అని కీర్తించారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

పెదకాకాని: లోక రక్షకుడైన ఏసుక్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెదకాకాని మండలంలోని అయా గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చర్చిలను విద్యుత్ కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు, క్రీస్తు జననం వృత్తాంతాన్ని తెలియజేసే విధంగా పశువుల పాక సెట్టింగ్‌లతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. క్రిస్మస్ పురస్కరించుకుని తెల్లవారుజామును చర్చిల్లో జరిగే ప్రార్థనలకు హాజరయ్యారు. మానవాళి అశాంతితో బాధపడుతున్న వేళ పాపులను కరుణించే రక్షకుడిగా పశువుల పాకలో యేసుప్రభువు జన్మించాడని సంఘకాపరులు బైబిల్ సందేశం వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, శాంతి, కరుణ, దయ కలిగి ఉండాలని బోధనలు చేశారు. క్రిస్మస్ పండుగ రోజున కేక్ కత్తిరించి ఆహ్లాదకరంగా పండుగ జరుపుకున్నారు. క్రైస్తవ సోదరులు ప్రార్థనల అనంతరం స్నేహితులను, ఆప్తులను ఆహ్వానించి బిర్యానీ విందు ఏర్పాటు చేశారు.

కన్నుల పండువగా లోకరక్షకుడి జన్మదిన వేడుకలు

చేబ్రోలు: లోకరక్షకుడి జన్మదిన వేడుకలను చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ కూడలి ప్రాంతాల్లో స్టార్‌లను విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. ప్రార్థన మందిరాలను రంగురంగుల కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి, ముందు పూలతివాచీలు పరిచారు. లోకరక్షకుడికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చేబ్రోలు మండల పరిధి లోని నారాకోడూరు, సుద్దపల్లి, చేబ్రోలు, పాతరెడ్డిపాలెం, కొత్తరెడ్డిపాలెం, శలపాడు, శేకూరు, వేజండ్ల, వడ్లమూడి గ్రామాల్లో క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. పేద ప్రజల అభ్యున్నతి కోసమే లోకరక్షకుడు జన్మించాడని ఫాదర్ ప్రసన్న కుమార్ తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నప్పుడే దేవుని కృప పొందేందుకు అర్హులవుతారని చెప్పారు. ఎదుట వారిపై ద్వేషం, అసూయ కలిగి ఉన్నవారు దేవునితో శిక్షింపబడతారని తెలిపారు.

మానవాళి రక్షణ కోసమే క్రీస్తు జననం

పొన్నూరు: లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా బుధవారం క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచే దేవాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి చర్చిలకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్లు క్రిస్మస్ పండుగ సందేశాన్ని భక్తులకు అందించారు. అనంతరం ఒకరినొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని క్రీస్తు శతవార్షిక లూథరన్ దేవాలయంలో రెవరెండ్ పాస్టర్ కనపర్తి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రిస్మస్ సందేశమిచ్చారు. సర్వమానవాళి రక్షణ కోసమే ఏసు క్రీస్తు జన్మించారని తెలిపారు. లోక రక్షకుడిగా ఆయన అందరికీ ప్రభువై ఉన్నారని చెప్పారు. క్రిస్మస్ పర్వదినం నాడు ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలను పదిమందికి పంచుతూ పేదలకు అన్న, వస్త్రదానాలు చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏసుక్రీస్తు ఆశీర్వాదం ప్రతి ఒక్కరిపై ఉండాలని, నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.



లూథరన్ చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ ఆశీర్వాదం



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు



నారాకోడూరులోని తెలుగు బాప్టిస్ట్ చర్చి

దాతల సహకారంతో ఆలయ ప్రహరీ నిర్మాణం

స్పష్టం చేసిన గంగమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు

ప్రత్తిపాడు: దాతల సహకారంతో ఆలయ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నామని గంగమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక గంగమ్మ తల్లి ఆలయంలో గుడి కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడులో ఆలయాన్ని రెండేళ్లుగా గ్రామస్తుల సహకారంతో దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే ప్రస్తుతం ప్రహరీ నిర్మాణం చేస్తున్నామని, కానీ కొందరు గిట్టని వ్యక్తులు తమపై అసత్య ఆరోపణలతో అధికారులకు పిటిషన్లు పెడుతున్నారని తెలిపారు. ఇది కచ్చితంగా భక్తుల మనోభావాలను కించపరచడమేనన్నారు. అధికారులు స్పందించి నిజ నిర్ధారణ చేసి నిజాలను నిగ్గు తేల్చాలని కోరారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ అధికారులను, భక్తులను, గ్రామస్తులను తప్పుదారి పట్టించడం సరికాదని చెప్పారు. సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు జెట్టి పరమేశ్వరరావు, రాయల వెంకటరత్నం, బాపతు సత్యనారాయణ రెడ్డి, చిన్నం శంకర్, చాంగటి శ్రీను, కమ్మా శివప్రసాద్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

వ్యాపారుల సమస్యలకు సత్వర పరిష్కారం

నగరంపాలెం: వ్యాపారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్ష అభ్యర్థి యేల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తపేటలోని కొత్తూరి బాలకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి వ్యాపార వర్గాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. వ్యాపారుల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తామని చెప్పారు. కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార వర్గాల ప్రయోజనమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ప్రస్తుత అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, మాజీ ఉపాధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, సభ్యులు, వ్యాపార వర్గాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యేల్చూరి వెంకటేశ్వర్లు

అధ్యక్ష అభ్యర్థి రంగా బాలకృష్ణ ప్రచారం

నగరంపాలెం: ఈనెల 28న జరిగే చాంబర్ ఎన్నికల్లో తన ప్యానెల్‌కు ఓట్లేసి గెలిపించాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) అధ్యక్ష అభ్యర్థి రంగా బాలకృష్ణ కోరారు. పట్నంబజార్, బండలబజార్ తదితర ప్రాంతాల్లోని వ్యాపారులను బుధవారం ఆయన కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారుల సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

అన్నదాతలను వణికిస్తున్న వాయు‘గండం



నంబూరు శివార్లలో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పిన రైతులు



నంబూరు శివారులో వర్షానికి నేలవాలిన వరిపైరు

- ఆకాశం మేఘావృతం
- రెండు రోజులుగా వర్షపు జల్లులు
- ఆందోళనలో వరి రైతులు

పెదకాకాని: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ అన్నదాతలను వణికిస్తోంది. ఆకాశం మేఘావృతమై కారుమబ్బులు కమ్మి, చిరు జల్లులు పడుతున్నాయి. దీంతో కాలువ కట్టలు, చెరువు కట్టలపై, పొలాల్లో ఆరుతున్న ధాన్యాన్ని కాపాడుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.పెదకాకాని మండలంలో వరి కోతలు మూడు వంతులు పూర్తయ్యాయి. మొక్క దశలో పొలాలు మునిగి ఉరక దెబ్బతినడంతో ఆలస్యంగా కోత వచ్చాయి. ఈ దశలో వాతావరణశాఖ హెచ్చరికలు అన్నదాతల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి వ్యయ ప్రయాసల కోర్చి పండించిన పంట తీరా నోటి దగ్గరకు వచ్చే సమయంలో వాయుగుండం కలవరపాటుకు గురి చేస్తోంది.

భారీగా పెట్టుబడులు

ఇప్పటికే వరికి రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. విత్తనాలు, దుక్కులు, ఎరువులు, పురుగుమందులకు భారీగా ఖర్చు పెట్టారు. మండలంలోని నంబూరు, గోళ్లమూడి, పెదకాకాని, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, దేవరాయబొట్లవారిపాలెం, తంగెళ్లమూడి, అనుమర్లపూడి గ్రామాల్లో భారీ ఎత్తున పంట సాగు చేశారు. పలుచోట్ల కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో పడుతున్న వర్షాలకు పంట నీటి పాలు కాకుండా పట్టాలు కప్పుకుని కాపాడుతున్నారు. వర్షం తగ్గగానే పట్టాలపై చేరిన నీటిని ఎత్తిపోస్తున్నారు. అక్కడక్కడా కోత కోయాల్సిన పైరు నేలపై వాలిపోయింది. ఇప్పటికైనా వరుణుడు కరుణిస్తే ధాన్యం ఇంటికి చేర్చుకోవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో కూటమి ప్రభుత్వం వారి ఆగ్రహానికి గురికాకతప్పదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11వ వేతన సవరణ సంఘ గడువు ముగిసి 17 నెలలు కావస్తున్నప్పటికీ, నూతన పీఆర్సీ చైర్మన్‌ను నియమించకపోవడం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అల్పా ‘హాహాకారం’తో అవస్థలు

- ‘పది’ విద్యార్థులకు సాయంత్రం వేళ అందని స్నాక్స్
- అర్ధాకలితోనే ప్రత్యేక తరగతులకు హాజరు
- నీరసించి ఏకాగ్రత కోల్పోతున్న విద్యార్థులు



ప్రత్తిపాడు హైస్కూల్లో పది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

ప్రత్తిపాడు: పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సాయంత్రం వేళ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చిలో ఫైనల్ పరీక్షలు జరగనుండటంతో రోజుకొక సబ్జెక్టు చొప్పున ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు అదనంగా బోధన చేస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ వంటివి సమకూర్చకపోతుండటంతో అర్ధాకలితోనే చదువులు చదవాల్సి వస్తోంది.

ఇంటికెళ్లే వరకూ మధ్యాహ్న భోజనంతోనే..

పది విద్యార్థులు ఉదయం ఎనిమిది గంటలకు పాఠశాలకు హాజరవుతున్నారు. వారిలో కొంత మంది ఉదయం అల్పాహారం తిని బడికి వస్తుండగా, మరి కొందరు టిఫిన్ చెయ్యకుండానే వచ్చేస్తున్నారు. టిఫిన్ చెయ్యకుండా బడికి వచ్చిన విద్యార్థులు మధ్యాహ్నం వరకు ఆకలితోనే ఉండాల్సి వస్తోంది. కాగా మధ్యాహ్నం పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం చేసి సాయంత్రం ఐదున్నర గంటలకు ఇంటికి వెళ్లే వరకూ అలానే అర్ధాకలితోనే ఉండాల్సి వస్తుంది. దీంతో చదువుపై ఏకాగ్రత పెట్టలేని పరిస్థితి విద్యార్థుల్లో కనిపిస్తోంది. నియోజకవర్గంలోని 37 హైస్కూళ్లలో 1,588 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు.

కార్యరూపం దాల్చని ఎమ్మెల్యే హామీ

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఈ నెల 7వ తేదీన నిర్వహించిన మెగా టీచర్స్, పేరెంట్స్ కమిటీ సమావేశానికి ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఆ సందర్భంలో ఆయన సాయంత్రం స్నాక్స్ అందుతున్నాయా ? అని విద్యార్థులను ప్రశ్నించారు. వారు నో సార్ ! అని సమాధానం ఇచ్చారు. దీంతో ఆయన ‘‘ తాను కూడా డబ్బులు ఇస్తానని.. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలు స్నాక్స్ అందిద్దాం’’ అని చెప్పారు. ఆయన హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీంతో విద్యార్థులకు సాయంకాల వేళ అర్ధాకలి చదువులు తప్పడం లేదు. గతంలో ప్రభుత్వం పది విద్యార్థుల కోసం సాయంత్రం పూట రకరకాల స్నాక్స్ అందించేది. కానీ కూటమి ప్రభుత్వం దిశగా ఇంకా చర్యలు తీసుకోకోపోవడంతో ఇక్కట్లు తప్పడంలేదు.

ఇచ్చిన డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: ఇచ్చిన డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. మార్కాపురం సీఎస్‌టీ టాకీస్ రోడ్డు ప్రాంతానికి చెందిన తందే శేఖర్ బాబు మిర్చి వ్యాపారం చేస్తుంటాడు. ఆయన గుంటూరు దేవాపురం 5వ లైన్ ప్రాంతానికి చెందిన బర్మా వెంకటరావుకు అవసరాల నిమిత్తం రూ.39.95 లక్షలు అప్పుగా ఇచ్చాడు. దానికి గాను 195 చదరపు గజాలలో ఉన్న ఇంటిని 2017లో వెంకటరావు శేఖర్ బాబుకు రిజిస్టర్ చేశాడు. అప్పటి నుంచి బర్మా వెంకటరావు డబ్బు వాపసు చేయక పోగా రిజిస్టర్ చేసిన ఇంటిని కూడా ఖాళీ చేయడం లేదు. దీంతో ఈనెల 22న నగదు వాపసు ఇవ్వాలని, లేని పక్షంలో రిజిస్టర్ చేసిన ఇంటిని ఖాళీ చేయాలని అడగడంతో బర్మా వెంకటరావు బెదిరింపులకు దిగి దుర్భషలాడాడు. దీంతో బాధితుడు శేఖర్‌బాబు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.